# అనిల జ్యోతి

"నేపుట్టింది - సైరంధ్రి కులమూ,
నే పట్టింది గంధర్వ వ్రతమూ'

యక్షగానం వినిపిస్తోంది. భాగవతములు సరదాగా పాడుకుంటూ వెళుతున్నారు. ఎక్కడో వీధినాటకం లాగుంది.

సంజె చీకట్లు క్రమ్ముతున్నయి. వీధుల్లో పిల్లల కోలాహలాలు వినిపిస్తున్నాయి. రాత్రి భోగిమంటలకి తగలబెట్టే సామాన్లకోసం పిల్లలు కొంతమంది హడావిడిగా అటూఇటూ పరిగెడుతున్నారు. మరికొంతమందికేకలు పెడుతూ పిడకలు దండు కుంటుకున్నారు. పీటలూ, చాపలూ చేతపట్టుకుని ఆడవాళ్లు నలుగురూ, చుట్టలు పీలుస్తూ ఉత్తరీయాలు వేసుకుని ముగ్గురు మగవాళ్లూ నడుచుకుంటూ వెళుతున్నారు- నాటకానికే కాబోలు -దూరంనించి వస్తున్నట్టున్నారు. పెందలాడే బయలుదేరి.

చుట్టూ ఇళ్ళల్లో ఎప్పటికంటె మహా సందడిగా ఉంది. తెల్లవారుజాము స్నానాల యేర్పాట్లతో గంగాళాలూ, బిందెలూ చప్పుళ్ళవు తున్నాయి. చుట్టూ ఆడవాళ్ల పురమాయింపులూ, అక్కడక్కడ పశువులమీద పనివాళ్ళ అదలింపులూ, మగవాళ్ళ అధికార స్వరాలూ వినవస్తున్నాయి. కొంచెం చలిగా కూడా ఉంది అప్పుడే.

రోజంతా తిరిగి తిరిగి వచ్చిన అలుపైనా తీర్చుకోకుండా. కామాక్షి తిన్నగా మధు ప్రక్కదగ్గిరి కొచ్చి వంగి చూసింది. పడుకున్న మధుసూధన ముఖం గోడవేపు తిరిగివుంది.

"ఆకలి వేస్తోందా? గంజి కాచి ఇమ్మన్నారా? పోనీ ముందర మందు తీసుకుంటారా?" వంగి మంద్ర స్వరంతో అడిగింది కామాక్షి.

"ఏం, నీ పావురాల సంరక్షణ అయిపోయిందా?-నా దగ్గర కొచ్చావు?" అన్నాడు మధు-విషంగా, ముఖం తిప్పకుండానే.

"జతలో ఒకటి చచ్చేపోయింది గాదండీ? ఆ ఉన్న ఒకటీ మేతయినా తినడం లేదు," అంది కామాక్షి బాధగా.

"మహామంచి పనయింది!"

"ఏమండీ? అంత భూతదయ కలవారు ఇల్లా మాట్లాడుతున్నారు!" అంది దీనంగా.

కాస్సేపు అక్కడే నిలబడ్డది, మధు మాట్లాడలేదు. తనకేసి చూడనూలేదు.

కాళ్లీడ్చుకుంటూ లోపలికెళ్లి బట్టలు మార్చుకుని వంటింట్లో కిటికీలో చతికిల బడిపోయింది. కామాక్షికి కడుపులో ఆకలి మండి పోతున్నా ఏమీ తినాలని లేదు. మధు కోపం చల్లారేవరకూ అక్కడే కూచుందా మనుకుంది. తనకీ లోపల కోపంగానే వుంది.

ఎందుకో ఆ అమ్మాయి తిరిగి జ్ఞాపకం వచ్చింది, కామాక్షికి. ఎంత చక్కని సాటిన్ పావుడా ఆ పిల్ల కట్టుకున్నది. టెర్రిలిన్ చీరలోనించి గులాబీ రేకులకంటె మృదువుగా ఎర్రగా కనిపించిందా పావడా! ఈవేళ ప్రొద్దున్న తన రౌండ్సులో కిషోర్ చంద్ మాన్షన్సులో సెకండ్ ఫ్లాట్ తలుపు కొట్టబోయేటప్పటికి, లోపల్నించీ చిన్న చిన్ననవ్వులు వినిపించినయి. నవ్వు ఆపుకుంటున్న స్వరంతో, "ఎవ్వరూ? రండి," అంది ఆ పిల్ల. గదిలోపల్నించి, సవరించుకున్న మగ గొంతుతో ఈల పాట వినిపించింది. రేగిన జుట్టుతో ఎంత అందంగా వుంది ఆ పిల్ల. ఎంత ఆప్యాయతతో కుర్చీలో ఆవిడకి దిండు సర్దాడతను. ఎంత మెత్తగా వుంది సాటిన్ పావడా.

ఏమిటీ తలపులు! ఇంకా యేమిటో జ్ఞాపకాలు ఒక సంవత్సరం క్రితం మాట. అసలెందు కివ్వన్నీ ఇప్పుడు? అయ్యో అయ్యో! వద్దనుకున్నా తలపు కొస్తూనే ఉన్నాయి. అవును, అవీ ఇలాగే పర్వదినాలే. అప్పటికి తాతయ్య పోయి నాలుగు

మాసాలే అయింది. తాతయ్య తోనే ఇల్లూ వాకిలీ సమస్తమూ పోయినయి. రమణమ్మత్తయ్య ఒక్కతే శరణ్యం. మామయ్య కొరగానివాడు. ఒక వారం రోజుల్లో వాళ్ళిద్దరూ అమెరికా వెళ్ళిపోతున్నారు. అందువల్ల తనకి తెలిసినవాళ్ళ ఇంట్లో పెడతాననీ, తరువాత ఉద్యోగం చూసుకోమనీ సలహా ఇచ్చిం దత్తయ్య. కామాక్షి కా ఇంట్లో జీవితం ఘడియ ఘడియా నరకయాతనగానే ఉండేది.

ఒకనా డెల్లాగో ధైర్యం చేసుకుని ఇల్లు వదలి కాలినడకని బయలు దేరింది. తాతయ్యతో బీచికి వెల్లిన అలవాటున, కాళ్ళు వాటంతటవ్వే బీచివేపు తిరిగినయి.

అప్పటికే తనచుట్టూ గాలి బలంగా వీస్తూంది బీచిలో.

కామాక్షి ఉద్యోగం చూసుకోవాలి. కాలేజీలో చదువూ పూర్తికాలేదు. ఇంకో వారంలో అత్తయ్యగారి నీడకూడా ఉండదు. మధుని కలుసుకుని ఎన్నాళ్ళయిందో? తాతయ్య పోయిన క్రొత్త రోజుల్లోనే అతన్ని చూడ డానికి వీలయింది. తరువాత మధుతో తను మాట్లాడితే రమణమ్మత్తయ్యకి గిట్టలేదు. పైగా, అతను వచ్చి నపుడల్లా ఏదో ఒక విధంగా అతన్ని అవమాన పరుస్తూండేది.

అదేమిటో, గడిచిన ఇన్ని మాసాలలోనూ ఇన్ని కష్టాలలోనూ మనస్సులో మధు ముఖమే అచలంగా సజీవ చిత్రంలా కనబడుతూంది. మధు ఒక్కొక్క మాటా, ప్రతిచేష్టా, చూసిన ప్రతి చూపూ హృదయాంతర్వాహినిలో ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. ఏదో తనకి తెలియని తియ్యదనం గుండెల నావరించే ఉంటోంది. అతి కష్టంమీద ఆ నిత్య మధుర స్వప్నావస్థ లోంచి మెలుకువలు తెచ్చు కొనేది. సద్యః పరిసరావస్థలు చన్నీళ్ళలా మొఖాన్న కొట్టేవి. ఎన్నాళ్ళయింది మధుని ప్రత్యక్షంగా చూసి, మధు తన చూపులలో మెసిలి. అయినాఇహ నెందుకు? అనాథ. అతను తల్లి దండ్రుల కను సన్నలలో బ్రతుకుతున్నవాడు. అతను ధనికుడు. తను పేదది. అన్నిటికంటే అతని ఇంట్లోనే మేనత్త కూతురుంది. ఆస్తి పరురాలు. తనకోసమే వాళ్ళ కుటుంబ మంతా పేరు పెట్టినపిల్ల. ఇహ మధుని మరచి పోవాలి. ఎల్లా సాధ్యం?

ఎదురుగ్గా సముద్రం లేపిన నీళ్ళ స్తంభాలని పెనుగాలి కూల్చేస్తోంది. గంటలు గడవడమే గుర్తురాలేదు. కామాక్షికి, తన ఆలోచనలలో, మనో వేదనలలో.

చటుక్కున, ఎవ్వరో మొఖంమీద ఏమిటో విసిరారు. కామాక్షికి తెలివి వచ్చినట్ల

యింది. ముఖంమీద వచ్చి పడ్డది ఇసక - చేటలతో ఎత్తి పోసినట్టూ అటూ ఇటూ తనమీద వచ్చి పడుతూంది. రాక్షసి బలంతో గాలి వీస్తూంది. పెద్ద నీటి కొండల్లాంటి అలలతో నురగలు క్రక్కుతూ సముద్రం తల్లడిల్లి పోతూంది. ఆకాశం కారు మేఘాలతో బరువుగా వంగి పోతూంది. అంతవరకూ పడుతూన్న చిటి ముత్తెపు వానజల్లు కుంభవృష్టిగా మారింది. సంధ్యచీకటి నల్లమబ్బు రంగు వేసుకుని, వర్షపుతెరలు కట్టుకుంది. ఏమిటో చుట్టూ అంతా ప్రళయంలా గుంది. కామాక్షి తడిపి పోతూంది. తనచుట్టూ నిర్మానుష్యం.

ఎక్కడా పిలుపు? "కామూ! కామూ!"

సముద్రపు ఘోషలో, గాలి హోరులో, వర్షపు రొదలో - ఈ బీభత్స విశ్వపు ఉగ్రనృత్యంలో, అదృశ్య దేవత ఎవ్వతో వీణె మీటింది.

పరిచిత స్వరం. ఎక్కడ? తీవ్ర వాంఛలూ, ఊహలూ భౌతిక రూపాల్లాగానే గోచరిస్తా యంటారు. భ్రమ! వెర్రి భ్రమ!

అదిసరే, ఇపుడెల్లా తిరిగి వెళ్లడం? ఎక్కడికి వెళ్లడం ?

"కామూ! కామూ! ఎక్క డున్నావు? ఉన్నచోటే ఆగు, వస్తున్నాను."

నిజం, మధు తనని వెతుక్కుంటూ వస్తున్నాడు. అప్రయత్నంగా, "మధూ, ఇదిగో, ఇక్కడే ఉన్నాను," అంది గట్టిగా, ఈ చీకటిలో ఈ ఉప్పెనలో మధు తన కోసం వచ్చాడా? అబ్బ! తనకి తట్టుకో లేనంత సంతోషం వచ్చింది. అయితే, మధు కెలా తెలిసింది తనిక్క డున్నట్టూ-?

"మీ అత్తయ్య గారింటి కెళ్ళాను. నిన్నిక్కడ చూసినట్టూ వాళ్ల డ్రైవరు చెప్పాడు. కారు తక్షణం టాప్‌గేర్‌లో ఇటు పట్టించాను. దారిలో గాలి, వాన ఎక్కువయినయి. ఇప్పటి టెంపరమెంటల్ కండిషన్ని పట్టి చూస్తే, నువ్విక్కడే పడి ఉంటావని నిశ్చయంతో పరిగెట్టు కొచ్చాను, రా. వెళదాం!'' అని ఏక ధాటిగా అంటూ చెయ్యి పట్టుకుని తడి ఇసకలో నించీ చర చరా ఈడ్చుకు పోయాడు కారువేపు. పరిపరి విధాల పోయే భావాల భారం కామాక్షి గొంతు నొక్కేసింది. మంత్ర ముగ్ధలా మధు వెనక నడిచింది.

కారు కదిలిన తరువాత, "అబ్బ ఎంత తడిశావు? జబ్బు చేస్తుంది. ముందు

ముఖం తుడుచుకో" అన్నాడు మధు, ఒకచెయ్యి స్టీరింగ్ మీదనే ఉంచి, రెండో చేత్తో తన జేబు రుమాలు అందిస్తూ.

కామాక్షికి జవాబు తోచలేదు. ఈ స్థితిలో అత్తయ్యకి కనిపిస్తే, ఇంక చెప్పాలా? పైగా మధు కారులో తాను దిగితే తక్షణమే బయటికి నడవ మంటుంది. ఆ తరువాత గత్యంతరమేమిటి?

"కామూ! ఏం మాట్లాడవు? మీ అత్తయ్య చంపేస్తుందేమోననా? మా ఇంట్లోనూ అంతే."

కామాక్షికి కాస్త ఆత్మగౌరవం దెబ్బతిన్నది.

"అల్లాంటప్పుడు ఎందుకొచ్చారు, నాకోసం? మీకు దెబ్బలాట రాదూ?"

"ఎందు కొచ్చారేమిటి? పిచ్చి ప్రశ్న. ముందర నిన్ను ఒక స్నేహితుల ఇంటికి తీసికెళతాను. అతను ఉద్యోగస్థుడు, గృహస్థుడు."

"ఏం, మీ ఇంటికెళ్ళడానికి భయమా?" అడిగింది. కాస్త కటువుగానే, కామాక్షి.

"అవును," అన్నాడు మధు నిస్సందేహంగా. కామాక్షి ముఖం కాస్త ఎఱ్ఱబడ్డది – అభిమానంతో.

"నిన్ను నేను పెళ్ళాడడం మావాళ్ళ కిష్టంలేదు."

"పెళ్ళా!"

చుట్టూవున్న పెనుగాలి వానని చీల్చుకుంటూ, ఉరుములకీ, మెరుపులకీ ఎదురు బొబ్బలు పెడుతూ, శరవేగంతో కారు పోతూంది.

కామాక్షికి గడచిన కొన్ని సంవత్సరాలనించీ మనస్సులోనే కోరుకొంటున్న సౌభాగ్యం. పేదకి పెన్నిధి దొరికినట్టయింది.

కాస్సేపు ఇద్దరూ మౌనం.

"ఏం బాధపడుతున్నావా?" అడిగాడు మధు. కామాక్షి ముఖం మెరుపు వెలుగులో చూసి.

తను అనాథ కనుక మధు ఇంత దయదల్చా డనుకుంది, కామాక్షి. కామాక్షి మనస్సులో ఏదో అసంతృప్తి దోబూచులాడుతూనే వుంది.

"నా ఉద్యోగం చాలు. ఇంట్లోవాళ్ల ఆస్తి నాకేమీ అక్కర్లేదు... నువ్వే నాకు ఆస్తి." అన్నాడు కాస్త మంద్రస్వరంతో.

కామాక్షి శరీరంలో ప్రతి అణువూ, అనిర్వచనీయమైన ఆనందంతో తబ్బిబ్బయింది.

కారు రోడ్డు లైటు క్రిందికి వచ్చింది. ఛటుక్కున కారాపేశాడు మధు.

"కామూ!" అన్నాడు, "నీతో ఒక్కమాట చెప్పటానికి ఇన్ని సంవత్సరాలూ ఆగాను. ఎల్లా చెప్పాలో తెలియలేదు. ధైర్యం లేకపోయింది..." కాస్సేపయ్యాక "నిన్ను నేను నిరంతరమూ ప్రేమిస్తూనే వుంటాను. ఎన్ని బాధ లొచ్చినా, ఏ కష్ట మొచ్చినా, నన్ను నువ్వు వదలవుగదూ!" అన్నాడు మధు. గుండెలు పెగుల్చుకుని వచ్చిం దతని స్వరం, అతని కళ్ళల్లో చెమ్మ దీపం వెలుగులో మెరిసింది.

వాళ్ళ భావి దాంపత్య మందిరంలో జ్యోతి వెలిగింది.

★ ★ ★ ★

ఆనాటి మధు ఎక్కడ! ఈ భర్త ఆ మధుయేనా?

ఈ జ్ఞాపకాలలో, లోపలగదిలోనించీ మధు మూలుగుడు వినిపించింది. కామాక్షి కడుపులో ఏదో దేవినట్టయింది. ఆయన అంత బాధపడుతున్నారు. అసలు ఏ దుర్ముహూర్తాన ఆ కారుట్రిప్ వెళ్ళారో ఇద్దరూ, ఈ ఆక్సిడెంట్ అయింది. పెండ్లయిన ఆరునెలలు ఉన్న దానితో తృప్తిపడుతూ-అబ్బ! ఎంత సుఖంగా ఉన్నారో, ఇద్దరూ! ఇల్లా కాళ్ళు ఫ్రాక్చర్ అవడమేమిటీ - ఉద్యోగం కాస్తా పోయె. 8, 9 మాసాలయ్యాక తిరిగి ఆపరేషన్ చేసి చూడాలన్నారు, డాక్టర్లు. కాళ్ళు సరిచేయడానికి అవకాశం వుండొచ్చు అన్నారు కూడాను.

కామాక్షి విధిగా ఉద్యోగం వెతుక్కోవలసి వచ్చింది. ఎడ్వర్టయిజింగ్ సేల్సు గర్ల్‌గా కుదిరింది. అందువల్లనే మధుకి, మందులూ, టానిక్కూ ఇవ్వగలుగుతూంది. కాని, తన కాపరంలో నెమ్మది లేకపోయింది.

ఒకనాడు, జీతమందుకొని కామాక్షి, మందులూ, టానిక్కూ, పండ్లూ కొని అమితసంతోషంగా ఇంటికి తెచ్చింది. మధు, అవి చూడగానే, "నా కివ్వేవీ అక్కర్లేదు,'' అని ఖచ్చింతంగా చెప్పి, వెంటనే గోడవేపు తిరిగి పడుకున్నాడు.

మరొకనాడూ, అల్లాగే, అలసి సొలసి ఇంటికి తిరిగివస్తే. "ఇప్పటికయిందా ఇళ్ళన్నీ తిరగడం? ఇల్లు జ్ఞాపకం వచ్చిందా? నీకేమే, కాలిచ్చా, చెయ్యిచ్చా, తిరిగి వచ్చావుగా," అన్నాడు మధు విసుగ్గా, తను గుమ్మంలో అడుగుపెట్టగానే.

కామాక్షి కేమనాలో తోచలేదు.

"ఎండబడి వచ్చానండి. ఏం, అల్లా అంటున్నారు?'' అంది కాస్త తెప్పరిల్లి.

"ఏం, సంపాదిస్తున్నాననా-నోరు మహాలేస్తూంది? నా ఖర్మ కాలి ఆడదాని సంపాదన తినాల్సినరోజు వచ్చిందిరా, దేముడా?'' అని ఒక నిట్టూర్పు విడిచాడు.

కామాక్షికి డొక్కా పిక్కా ఆడలేదు. అల్లాగే నిలబడి పోయింది.

"ఏం నిలబడ్డావు కాళ్ళు కడుక్కోడానికి నీళ్లు తెచ్చి ఇవ్వనా? అందుకైనా లేచే ప్రాప్తి పెట్టలేదే భగవంతుడు, ఎన్నాళ్ళురా బాబు, నాకీ చేతకాని బ్రతుకు? ఆపరేషన్ ఎప్పుడు చేసి లేపుతారో నన్ను!" అంటూ కళ్ళు గట్టిగా మూసుకుని పడుకున్నాడు మధు.

ఇల్లా గడుస్తున్నాయి రోజులు.

★ ★ ★ ★

రెండు నిమిషాల్లో, లోపలనించీ, మధు కోపస్వరం తిరిగి వినొచ్చింది. "ఏం, నిన్నే, ఏయ్. మగాడు ఇంకా బ్రతికివున్నాడని మర్చిపోయావా? ఎంత మంచాన పడ్డా, కాస్త మగాడని గుర్తుంచుకో. వాడికి ఆలనా పాలనా చూద్దామంటూ ఏమీ లేదు, ఎందుకుంటుందీ?"

"ఇదిగో మందు పోసుకొస్తున్నానండీ," అంది కామాక్షి, దగ్గరకొచ్చి.

చేతి కివ్వబోయిన మందు గ్లాసు, ఒక్క త్రోపుతో క్రిందికి పడద్రోశాడు మధు. "నాకెందుకే ఈ మందులు! నువ్వు షోకు చేసుకుని తిరిగితే చాలదూ!'' అంటూ.

పగిలి క్రిందబడ్డ గాజు ముక్కలన్నీ ఏరి పారేసి శుభ్రం చేసింది కామాక్షి నోటమాట లేకుండా.

మెల్లగా లేచి వెళ్ళి బయట కటకటాల గేటుమీద చెయ్యివేసి నిలబడ్డది. బయట పిల్లల అల్లర్లు వినిపిస్తూనే ఉన్నాయి. గాలి చల్లగా వీస్తూంది. చిన్న చిన్న దూది పింజల్లాంటి మబ్బులు ఆకాశంమీద తేలిపోతున్నాయి. తల బ్రద్దలైపోతూంది, కామాక్షికి. కడచిన ఆరు నెలలనించీ మధు ముఖంలో సుఖంలేదు. కనుబొమ్మలు ముడిపడే ఉంటున్నాయి. కళ్ళల్లో ఏదో బాధ, ఉంటూనే ఉంటోంది. ఒక్క నాడు కూడా ఆదమరచి నిద్రపోలేదు, మధు. అర విడిచి మాట్లాడనూలేదు. తిరిగి ఎప్పటికైనా "కామూ," అని మనసారా పిలుస్తాడా, తనని – ఈ జన్మలో?

ఎదురుగా దూరంనించీ ఎత్తు మేడలో దేదీప్యమానంగా వెలుగుతున్నయి దీపాలు. మేడలోంచి లైట్ మ్యూజిక్ వినిపిస్తూంది. అలసిపోయి ఉన్న కామాక్షికి నిద్రవస్తున్న దనిపించింది. తిరిగి ఆ పిల్ల ఎందుకు జ్ఞాపకం రావాలి? తను మరిచిపోవాలి. అసలు ప్రొద్దున్న లేస్తే ఉద్యోగరీత్యా ఎంతమందిని చూస్తాంగాదు.. సంగీతం చాలా సుఖంగా వినిపిస్తోంది, ఎదరుమేడలోనించి. ఎవ్వరా పాడేది? ఎవ్వరిదా మేడ? జ్ఞాపకం వచ్చింది. శ్యాముది ఆ మేడ. అన్నట్టూ ఈవేళ అతని ఇంట్లో పార్టీ. చెప్పాడుగా – ఈ ఊరు వచ్చిన ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ గౌరవార్థం అని. ఈవేళ సాయంత్రం తన కారులో తనకి లిఫ్టు ఇచ్చేటప్పుడే చెప్పేశాడు.

శ్యాము కారులో ఇంటివద్ద వదలిపెడుతూండటం, మధుకి ఏమీ గిట్టడంలేదు. "కార్లలో ఎక్కి తిరుగున్నా''వని కోపగించుకుంటూనే ఉన్నాడాయె దానికిగాను శ్యాము కారు ఆ దారిని రాకముందే తన రౌండ్సు త్వరగా ముగించుకుని కొన్ని ఇళ్ళు చూడకుండానే, ఇంటికి తిరిగి వచ్చేస్తూంది, కామాక్షి ఈ మధ్య. కాని, ఈవేళ శ్యాము కారుని తప్పించుకోలేక పోయింది, కామాక్షి. అయినా, అసలు ఎందుకు తప్పించుకోవాలేం? అతను మధుకి బాల్యస్నేహితుడాయె. తన తాతగారికీ, తనకీ కూడా తెలిసినవాడాయె. కాని, ఇప్పుడు మధుకి శ్యాము అంటే అంత గిట్టడం లేదు. దానికి ఏమీ కారణమూ లేదు.

అసలు శ్యాముని, తిరిగి ఇన్నాళ్ళకి, ఈ మధ్యనే చూసింది తను. ఒకనాడు, తను మిడి మిడి ఎండలో కాలినడకని ఇంటికి తిరిగి వస్తూంటే, వెనకనించీ పెద్ద కారు వచ్చి ప్రక్కన ఆగింది. దానిలోంచి "కామూ, కామూ!" అంటూ అమిత

సంతోషంగా శ్యామ సుందర్ దిగాడు. "కామూ, ఏం, ఒంటరిగా వస్తున్నావు? మధు ఏడి? ఇంత ఎండలో ఎక్కడ్నించి వస్తున్నావు? ఏం, ఇల్లా చిక్కిపోయావూ?'' ఊపిరాడకుండా ప్రశ్నలు వేశాడు.

తనని అంత స్వతంత్రంగా పిలిచేవాళ్ళు మగాళ్లలో తాతయ్య కాక, మధూ, శ్యామసుందర్‌లు మాత్రమే. కామాక్షికి పట్టలేని సంతోషం వచ్చింది. "నువ్వెప్పు డొచ్చావు?" అంది ఎదురు.

"నన్నీ ఊరు పోస్టు చేసారు. మీకోసం తెగవెతికాను. అడ్రసు ఎవ్వరూ ఇవ్వలే.'' అన్నాడు.

"నేను ఉద్యోగం చేస్తున్నాను, వారికి బాగాలేదు, శ్యామూ.' అంది కామాక్షి.

''ఆc! నువ్వు కారులో కూచో ముందర. పద, వాణ్ణి చూడాలి నేను," అంటూ కారు తలుపు తీసి ఒకచేత్తో ఆహ్వానిస్తున్నట్టు ప్రక్కగా నించుని, "ఊc! చూస్తావేం? రా, ఏమిటివాడికి ఒళ్లు? కూచో,'' రెట్టించాడు.

మొఖమాట పడుతూనే కారెక్కింది, కామాక్షి.

కారులో క్రింద ఒకప్రక్కన ఇనపవల అల్లిన కొయ్యగూట్లో మంచు ముద్దల లాంటి తెల్లటి పావురాలు రెండు అటూ ఇటూ తిరుగుతున్నాయి. "ఎంత బాగున్నాయో!'' అంది కామాక్షి వాటికేసి చూస్తూ.

"ఇవి ఒక రకం పావురాలు. వీటికి ఎగరడం రాదు. ఇవి నాకు చాలా ఇష్టం, నా కివి ఒక స్టూడెంటు ప్రజెంట్ చేశాడు. నేను నీకు ప్రజెంటు చేస్తాను. తీసుకో,'' అన్నాడు.

"అబ్బెబ్బె! నా కెందుకు శ్యామూ? నువ్వే ఉంచుకో."

"నేను బ్రహ్మచారిగాణ్ణి, పెంచడం కష్టం, గృహస్థులు మీరు పెంచాలి. అన్నట్టు మీ అడ్రస్ ఏమిటి?"

"ఆపరేషన్ అయ్యాక ఏదైనా జాబ్ చూచుకుంటా నన్నారు. అంతవరకూ ఈ చిన్న ఇంట్లోనే ఉన్నాము." అంటూ కామాక్షి కారు దిగింది.

"అరే, శ్యామ్ అదేమిటి? ఎప్పు డొచ్చావురా?'' అన్నాడు మధు.

"టూ బాడ్, ఓల్డ్ ఫెలో! చాలా దురదృష్టవంతుడవు. అంతా చెప్పింది కాము, కారులో. ఏమీ భయంలేదురా!' అంటూ సందిట్లో ఉన్న గూడు క్రింద బెట్టాడు, శ్యాము.

"నేనేమో నడిచి వస్తోంటే దారిలో కనిపించాడు. కారులో ఎక్కించుకొచ్చాడు–మిమ్మల్ని చూసితీరాలని," అంటూ కామాక్షి "కుర్చీలో కూచో. సూటు నలిగి పోతుంది," అంది, మధుప్రక్కనే మంచంమీద కూచోబోతున్న శ్యామువేపు చూసి. శ్యాము కుర్చీలో కాలుమీద కాలువేసుకుని కూచుంటూ సిగరెట్ తీసి మధుకికూడా అందిచ్చాడు.

"వద్దు. ఇప్పుడే కాల్చాను." అన్నాడు మధు, మాసిన గడ్డం చేత్తితో తడుము కుంటూ.

"అగ్గిపెట్టె తెస్తానుండు." అంది కామాక్షి.

"అబ్బే! అక్కర్లేదు కామూ, శ్రమపడకు. నాదగ్గర లైటర్ ఉంది.'' అన్నాడు శ్యాము. ఒక్కసారి సిగరెట్టు పొగ బయటికి ఊదుతూ, ఆలోచనా పూర్వకంగా, "మారు రూపయి పోయావురా, మధూ!'' అన్నాడు.

"అవున్రా, నీలాగే నేనూ ఇంగ్లండువెళ్ళి చదివి వస్తే, ఇలా నీటుగా ట్రిమ్‌గా తయారవుదును. మరి నీ స్టైలూ, ఫిగరూ, నాకెల్లా వస్తాయి?'' అన్నాడు మధు, కాస్త కనీ కనబడని ఉద్రేకంతో.

"అదేమిటి ? ఇల్లా మంచాన్న బడి చిక్కిపోయి, గడ్డమూ అదీ పెరగబట్టి నీవల్లా ఉన్నావు. నేను కాస్త టెన్నిస్ అది ఆడతాను కనుక కాస్త ఫిగర్ ఉంది. అంతే!" అన్నాడు కాస్త చిరునవ్వుతో, శ్యాము. "కామూ, మధు ఒకప్పుడు ఎంత చక్కగా ఉండేవాడు?" అడిగాడు మళ్ళీ నిష్కపటంగా.

"పడుక్కునే ఉండడం గదూ, శ్యామూ, బొత్తిగా మారు రూపు వచ్చింది," అంది కామాక్షి పావురాలని లోపల వసారాలో పెట్టి తిరిగి వస్తూ.

"నేను తిరిగి లేచి నప్పటి మాట.'' అన్నాడు మధు.

"అదేమిట్రా, అల్లా అంటావు? నువ్వు ఆపరేషన్ చేయించుకోవాలి. ఇహ ఇప్పుడు నేను దగ్గరుంటానుగా. ఆ విషయం కామూ నేనూ కారులోనే ఆలోచించు

కున్నాం. నా బాస్ లెక్చర్ టూర్‌లో నించీ త్రి ఆర్ ఫోర్ మంత్స్‌లో వస్తాడు. మళ్ళా ఎప్పుడో గబుక్కున అమెరికా వెడతాడు. ఆలోపుగా, నేనే ఆయన్ని వెంట బెట్టుకుని ఇక్కడికి తీసుకొస్తా. ఇల్లాంటి కాంప్లికేటెడ్ కేసెస్‌లో ఆయన అందెవేసిన చెయ్యిరా."

మధు మాట్లాడలేదు.

"నేను కాస్త కాఫీ చేసి తెస్తాను. పోనీ భోంచేస్తావా, శ్యామూ?" అంది కామాక్షి.

"నాకు వంటకుర్రాడు ఉన్నాడు. నువ్వు శ్రమ పడకు. నేను తీసుకున్న ఇల్లు ఇక్కడికి కనిపిస్తోంది. అదిగో," అని చూపించాడు.

"అవును దగ్గరే, సరే పోనీ, కాస్త కాఫీ అయినా పుచ్చుకో, మీకు కూడా ఒక కప్పు గంజి తెస్తానండీ" అంటూ వంటఇంట్లోకి వెళ్ళింది కామాక్షి.

ఇదిగో కామూ, ఏమిటీ మర్యాదలు ? నువ్వు మొదట వాడికి గంజి ఏర్పాట్లేవో చూడు. కావలిస్తే నేను డికాక్షన్ కలుపుకుంటాలే!" అంటూ అతను కామాక్షి వెనకాలే వెళ్ళాడు.

గంజి ఒక చేత్తోనూ కాఫీ ఒక చేత్తోనూ పట్టుకుని శ్యాము బయట కొచ్చేటప్పటికి, మధు నుదిటిమీద చెయ్యి పెట్టుకుని, వెల్లికిలా పడుకుని, క్రింద పెదవి ఒక ప్రక్క పన్నుతో కొరుక్కుంటూ, ఇంటి కప్పుకేసి చూస్తూ ఆలోచనగా పడుకున్నాడు.

"ఇదిగోరా గంజి, ఈసారి నే నిస్తా నీకు," అంటూ శ్యాము గంజి స్టూలుమీద పెట్టాడు.

చెయ్యి చాపకుండానే "పోనీలేరా, కాళ్ళులేని వాడికి గంజి తెచ్చి ఇచ్చావు." అన్నాడు కపటపు చిరునవ్వుతో, మధు.

మాటా మంతీ అయ్యాక, శ్యాము "నేనిక వెళతాను, రేపు తిరిగి వస్తా, హాస్పటల్‌కి వెళ్ళాలిగదూ మరి!" అన్నాడు, ఆరిపేసిన సిగరెట్ తుండు కిటికీలోనించీ బయటకి గిరవాటు వేస్తూ.

"ఉద్యోగస్థులు, తిరిగి కష్టపడి సంపాదించాలిగా. మరి, ఇంట్లోనే ఉంటారా?" అన్నాడు పైకి నవ్వుతూ, మధు.

శ్యాము నవ్వుతూ, "సరేరా, ఆ స్పెషలిస్ట్ ఇంటికి రాగానే, ఇక్కడికి తీసుకొస్తా. కామూ, బై! బై. ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేస్తానులే," అంటూ బయటికి వెళ్ళాడు.

కారు శబ్దం దూరమయ్యాక "ఏమండీ, ఆకలేస్తోందా? ఇప్పుడైనా తీసు కుంటారా గంజి?" అంది కామాక్షి. మధు మంచంమీద ప్రక్కన కూర్చుని.

"ఛప్! అవతలికిఫో! కామూ శ్రమ పడకు. కామూ బైబై, కామూ! వా డెవడు అల్లా పిలవడానికి?" అని అరిచాడు. ఆనాటి నించీ, శ్యాముని తిడుతూనే ఉన్నాడు, మధు.

ఆ మరునాడు శ్యాము రాగానే మధు గాఢనిద్ర నటించాడు. మరో నాడు, కారు శబ్దం వినగానే, తలనొప్పి అంటూ కళ్ళు మూసుకున్నాడు.

ఇన్నాళ్ళయ్యాక, ఈవేళ శ్యాము కారుని తప్పించుకోలేక పోయింది. తను, తిరిగి అతను తన కారులోనే దించాడు కామాక్షిని – స్పెషలిస్ట్ ఊళ్ళోకి వచ్చాడనీ, తను పార్టీ ఇస్తున్నాననీ, చెబుతూ శ్యాము అన్నట్టే, ఆ పెద్ద డాక్టర్ని తెచ్చి చూపిస్తే, ఆపరేషన్ చేస్తే – మధు సుఖపడతాడు.

ఎదురుగా శ్యాము మేడలోనించీ సంగీతం ఇంకా సుఖంగా వినిస్తూంది. ఎవ్వరో గోటువాద్యం వాయిస్తున్నారు – ఎంత బాగా వాయిస్తున్నారు! వినడానికి ఎంత సుఖంగా ఉంది! అవును. అన్నట్టూ ఆ వాయించేది శ్యాము. ఆ సంగతీ చెప్పాడుగా కారులో ఎవ్వరో భాగ్యశాలి పుట్టి ఉంది – అతని ప్రక్కన కూచోడానికి!

ఎక్కడనించో ఘల్లు ఘల్లున గజ్జలరవళి వినిపించింది.

"ఎంతమాట వింటినామ్మా! సుధేష్ణదేవీ-"

"రాజకాంతల కిది తగునటమ్మా.... ...."

భాగవతులు. తిరిగి వస్తున్నారు. ఏం, అపుడే అయిపోయిందా నాటకం? పాతపంపిణీని నాటకంవేస్తూ నవీన పద్ధతిగా పెందలాడే ముగించారు గాబోలు, ఈ మారు మూలపేటలో అన్నీ సాధ్యమే.

కామాక్షి, వెనక్కి తిరిగి వంటఇంట్లోకి వెళ్ళి గంజి వెచ్చచేసి తెచ్చింది. మంచం ప్రక్కగా ఉన్న స్టూలు మీదపెట్టి ఆరుస్తూ, "ఏమండీ, రేపు శ్యాము ఆ డాక్టర్ని తీసుకొస్తా నన్నాడు-" అని మొదలు పెట్టింది, నిమ్మళంగా.

ఉన్నట్టుండి, మధు గబుక్కున ఒక్కసారి తల ఎత్తి మోచేతి మీద ఆనుకుని, ఉద్రేకంతో అరిచాడు, "ఆపరేషన్ చేయిస్తా నంటున్నాడా? నీ తరంగాదు, నాకు ఆపరేషన్ చేయించడం.''

కామాక్షి, ఏదో చెప్పడానికి, "అదేమిటీ –" అనబోయింది. మధు "షటప్! వాడూ నువ్వూ కలిసి కార్లలో తిరుగుతూ నాకు ఆపరేషన్ చేయిద్దామని ఏర్పాట్లు చేశారటగా? నన్ను ఒక గినీపిగ్ లాగా అసహాయుణ్ణిచేసి, ఆయనగారూ సూటూ అదీ వేసుకుని స్టయిల్‌గా అటూ ఇటూ నడుస్తూ. నిటారుగా నించుని, నాకు ఆపరేషన్ చేయిస్తాడా? గతిలేక పడి ఉన్న నామీద చికిత్సలు ప్రారంభిస్తాడూ? కత్తి వాడి చేతుల్లో – నేను ఒక మట్టిబొమ్మ నన్నమాట. నాన్సెన్సు! అది జరగదు. ముమ్మాటికీ జరగదు. నా ఊపిరి ఉన్నంతవరకూ ఈ ఆపరేషన్‌కి నేను ఒప్పుకోను; ఇల్లా మంచానపడి చచ్చైనా పోతాగాని, 'కామూ, శ్రమపడకు, కామూ బైబై!' ఏమిటా స్వతంత్రం వాడికి? అయితే వాణ్ణే కామూ అని పిలవనియ్యి. అందుకే, అప్పటినించీ నేనా పిలుపు మానేశాగా, నాకు నువ్వు కామాక్షివే. అందరూ పిల్చినట్టే నేనూ పిలుస్తాను. నా ఎక్కువేమిటి? చచ్చుపీనుగని, ఏయ్, తెలిసిందా? ఆపరేషన్ మాత్రం చేసుకోను. తీసుక తీసుకు చస్తా. అల్లా చావకపోతే, వాణ్ణిడిగి కాస్త విషం తెచ్చిపెట్టు. నేను విరగడైపోతాను. ఆ తరువాత నువ్వు, వాడూ హాయిగా తిరగండి. ఎరగక చేసుకున్నారా, భగవంతుడా ఈ పెళ్లి – మా ఇంట్లో అమ్మనీ నాన్ననీ ఎదిరించి మరీని. అక్కడే ఉంటే సుఖపడుదునో! ఈ బాధలన్నీ తప్పును?.... ఇంకా నించున్నావేం, నా కళ్ళ ఎదురుగా? లే, నా కళ్ళకి కనబడకు. పో, పోయి ఎక్కడైనా చావు. నా ముందరకి రాబోకు యిక!" అరిచాడు ఏకధాటిగా.

నోరు తెరవకుండా కామాక్షి చేతి కందించిన వేడి గంజి గ్లాసు. విసిరి పుచ్చుకుని కామాక్షి ముఖం మీదే "పో, ఇక్కణ్ణించి!'' అంటూ కొట్టాడు.

కామాక్షికి కళ్ళు చీకట్లు క్రమ్మినయి. అభిమానంతోనూ, వేడితోనూ ముఖం ఎర్రబడ్డది. కన్నీళ్లాపుకుంటూ, ఆ గాజుముక్కలన్నీ ఏరి పారేసి, గది శుభ్రం చేసింది. తిన్నగా వంటఇంట్లోకివెళ్లి మతిపోయిన దానిలా నేలమీద పడిపోయింది. చుట్టూ ప్రపంచపు శబ్దాలేమీ కామాక్షికి సోకలేదు.

కోపం వెళ్ళగ్రక్కిన తరువాత శక్తంతాపోయి నీరసం వచ్చింది మధుకి. వెనక ఉన్న తలగడమీదికి తలపడ వేసుకున్నాడు. కోపం ఇంకా తగ్గినట్టుగా లేదు పూర్తిగా.

"ఛఛ! ఎందుకీ బ్రతుకు నాకు?" అన్నాడు తనకి తానే అనుకుంటున్నట్టు, "బ్రతికినా ఒకటే చచ్చినా ఒకటే. నాలాంటి వాళ్ళు చావడమే మంచిది. కాళ్లు పోయిన నాడే చచ్చి ఉంటే, నాకీ మనోవేదన అంతా తప్పునుగా. అసలు అప్పుడే చచ్చిపోదామని నిశ్చయించుకున్నాను. అదీ తప్పిపోయింది, ఎల్లాగో! మరే అలా పుణ్యం కట్టుకున్నదీ ఇదే, ఈ ఉద్యోగస్థురాలు. అప్పుడే మొదలు పెట్టింది నన్ను ఎదిరించడం. ఎట్లా కనిపెట్టిందో, చేతిలో ఉన్న స్లీపింగ్ పిల్సు బాటిల్ నాకు తెలియకుండా లాగేసింది. నాకందకుండా దాచేసింది. పైగా రాత్రంతా నా మంచం మీద ప్రక్కనే కూచుని వెధవనవ్వులు అదీని. మళ్ళా కారు బాగుచేయించుకుందాం! వచ్చే సంవత్సరం ఇల్లు కట్టుకుందాం వెధవ ప్రేలాపనా, అదీనూ, 'కాలులేదే వీడికి,' అన్న బాధైనా లేదే దానికి. అల్లాగే రాత్రంతా నిటారుగా బొమ్మలా కూచునే ఉండే! ఇంక నే నెక్కడ చావను!''

మధుకి ఒళ్ళంతా నొప్పులు.

"అమ్మయ్య!" అంటూ మెల్లగా ప్రక్కకి ఒదిగాడు. కదలకుండా పడి ఉండడం ఎంత బాధ! అట్లా పడుకునే ఉంటే, వస్తాదుకైనా ఒళ్లునొప్పులే. రోజూ ఈ కలహాల్లో కూడా, తనతో మాట్లాడకుండా తలవొంచుకుని, వీపు రాచి నిద్రపుచ్చేది కామాక్షి. ఒళ్ళంతా ఎంత నొప్పులో దానికీ తెలుసు గాబోలు! ఎందుకు తెలియదు? అపుడా రాత్రంతా. ఆసుపత్రిలో కదలకుండా నావద్దనే కూచోలే? దానికీ ఒళ్లు నొప్పులుపెట్టే ఉంటాయి. అబ్బ! వీపంతా చాలా పీకుతూంది. ఏం, అది ఇంకా రాలేదే, వీపురాచి నిద్ర పుచ్చడానికి ? ఛచ్చినా నేను మాత్రం పిలవనుగా; దా నంతట అదే రావాలి. రానియ్యి, మధుకి అలసిపోయినట్టుగా ఉంది, ఈ ఆలోచనలతో.

కామాక్షి వంటఇంట్లో ఎంతసేపుపడి ఉన్నదో ఆమెకే తెలియదు. ఆఖరికి లేచి మధు తల్లిదండ్రులకు మధుని ఒప్పచెబుతూ ఒక వుత్తరాం వ్రాసింది. ఏదో నిద్రలో నడిచే వాళ్ళలా నడచి బయటి కొచ్చింది. తిరిగిగేటు దగ్గిర నుంచుంది. గాలి చల్లగా ముఖానికి కొట్టింది. ప్రక్కఇళ్ళలో స్నానా లారంభించారు. అక్కడక్కడ వీథిలో భోగిమంటలు మండుతున్నాయి. తను ఇహ బ్రతకడంలో అర్థం లేదు. తన వల్ల మధుకి ఏ కారణంవల్లనో ఇంత కష్టంగా ఉంది. మధు ఎంత కష్టపడాలి! ఆ పెద్ద కాలువ సముద్రంలో కలుస్తుందట నిలువు లోతుందని అంటున్నారు.

మెల్లగా అక్కడికిచేరి, పడి చచ్చిపోవడానికి నిశ్చయించుకుంది. "మధు తిరిగి తన తల్లిదండ్రులతో కలసి సుఖపడనియ్యి.'' ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది కామాక్షికి. అదేమిటిది? "టప్" అని ఇంట్లోనించీ ఏదో శబ్దమయింది.

కామాక్షి ఇల్లంతా పరకాయించింది. శ్యాము ఇచ్చిన జతలో రెండో పావురం చచ్చిపోయి గూట్లోనించీ క్రింద పడిపోయింది. మొదటి పావురం చచ్చిపోయిన తరువాత ఇది కూడా మేతానీళ్ళు మానేసింది. వీట్లల్లో ఒకటి పోతే రెండవది బ్రతకదంటారు. ఒక వేళ అది నిజమేనేమో! నోరులేని జీవాలలో ఎంత ప్రేమ !

అవతలనించీ మధు నిద్రలో ఏదో గొణుక్కుంటున్నట్లు వినవచ్చింది. శ్రద్ధగా వింది. అబ్బ ! ఎంత దీనంగా ఉంది. మధు గొంతు ! ఏదో బాధలో ఉన్నట్లు "కామూ! కామూ!" ఎంత మనసారా పిలుస్తున్నాడో పేరు.

నిద్రలో మధు "కామూ, ఎంత బాధవచ్చినా, ఎన్నికష్టాలొచ్చినా, నన్ను విడిచి పెట్టవు గదూ!" నిరంతరమూ నిన్ను ప్రేమిస్తుంటాను.''

కామాక్షికి దుఃఖమూ, నిరాశా, కోపమూ కరిగిపోయాయి. మనస్సు పొంగు కొచ్చింది.

చేతిలో ఉన్న ఉత్తరం క్రింద పడవేసి మంచం దగ్గరికి ఒక్క అంగవేసింది. మధు నుదుటిమీద చెయ్యి వేసింది "మధు, మధు, నేను నిన్ను విడిచిపెట్టను, నేను చచ్చిపోను, నిన్ను బాగుచేసుకుంటాను.'' అంది, తనకి తెలియకుండానే స్వరంలో తన ప్రేమంతా పొదిగింది.

మధు కళ్లు తెరిచాడు. అందించిన భార్యచెయ్యి పట్టుకున్నాడు.

తూర్పారే వెలుగు ఆకాశంమీద అలుముకుంది. గాలి చల్లగా వీస్తూంది. చిన్న చిన్న తుంపరలు పడుతున్నాయి బయట.

"కామూ, నివ్వెన్నాళ్లు ఇలా తిరిగి కష్టపడతావు? నేను ఆపరేషన్ చేయించు కుంటా," అన్నాడు ఆప్యాయంగా.

గాలికి ఒక చిన్న తుంపరజల్లు ముత్యాలలా కిటికీలోనించీ వాళ్ళిద్దరి మీదికి విసిరింది.

"కామూ, రేపు శ్యాముని భోజనానికి పిలుద్దాం'' అన్నాడు మధు, ప్రేమతో.

✤ ✤ ✤